''నీవు తమ్ముగనికి ఇప్పుడేం జెప్పకు. రెండ్రోజులల్ల వొస్త. ఏమో.. మన అదృష్టం బాగుంటే దొర్కుతది. టీవీలల్ల అంతగానం సూపుతున్నరు! ఒకాయినకు రెండు దొరికే! అరవై లచ్చలంట అవిటికి. ఇంగొకాయిమెకు పదారు లచ్చలు. ఎవరికో కోటిన్నరంట. అట్ల మస్తుమందికి దొర్కవట్టే! నీవు నా గురించేం ఫికర్ జేయకు. నేను మంచిగనే ఉంటలే. ఉంట మల్ల.. శార్జింగు మూడు పుల్లలే ఉంది!''.. తన పక్కనే కూర్చున్న తిరుమలమ్మ ఫోన్‌లో కూతురితో మాట్లాడిన మాటలు నాగమ్మను ఆశ్చర్యానికి గురిచేశాయి.

''ఏందక్కా.. ఏంటివో 'లచ్చలు, కోట్లు దొరికినయ్!' అంటుండవు. యాడ? అసలు పైసల్ దొరుకుడేంది!?'' అని ఆమెను అడక్కుండా ఉండలేకపోయింది.

''పైసల్ గాదక్కా.. వొజ్రాలు! ఆడ కర్నూల్ దిక్కు.. నీకు దెల్వదా! టీవిలల్ల మస్తుగ సూపుతున్నరు''.

''తెల్వదక్కా.. ఎప్పుడు ఇనలే, సూడలే!''.

''నేను మొన్న టీవిల సూశి వొచ్చినక్కా!'' అని చెప్పి..

''నాకిద్దరు కొడుకులు, ఒక బిడ్డక్కా! నా పెద్దకొడుకు మొన్న గా కరోన రోగమని వొచ్చె గద.. అప్పుడు సచ్చిపోయిండు. ఇగ అప్పట్సంది అందరం చిన్న కొడ్కుతాననే ఉండుకమయ్యింది. వాడొక్కడే మాకు ఆదరవు. కానీ, మా గాచారం ఎట్లున్నదో సూడు.. వాన్కి రెండు కిడ్నీలల్ల ప్రాబ్లమున్నదంట. మస్తు ఖర్సొస్తున్నది. కోడండ్లే అట్లిట్ల తిప్పలు వడ్తున్నరు. అందుకే.. ఎట్లయితే అట్లయిందని ఈడ నాగర్ కర్నూల్‌ల ఉండే నా బిడ్డతానికి వొయ్యొస్తాంట జెప్పి.. వొజ్రాలు దేవులాడనీకే కర్నూల్ వోతుండ! తెలుస్తే మల్ల నా కొడుకు గరమైతడని! ఇగ మా అదృష్టమెట్లుంటే అట్ల!'' అంటూ తన కథంతా చెప్పుకొచ్చింది తిరుమలమ్మ.

ఆమె కథ విన్నాక తన పెద్ద కొడుకును గురించి గుర్తు చేసుకొని బాధపడుతూ.. తనుకూడా తన కథనంతా చెప్పుకొచ్చింది నాగమ్మ. ఆమె పరిస్థితి తెలుసుకున్నాక తిరుమలమ్మకు మనసంతా అదోలా అయిపోయింది. ఆమెను కూడా తనవెంట రమ్మన్నది. ఒకవేళ నిజంగానే వజ్రాలు దొరికితే తన సమస్య తీరుతుందేమోనన్న ఆశతో ఆమెతోపాటు నాగమ్మ కూడా పయనమయ్యొచ్చింది.

* * *

మరుసటిరోజు పొద్దున్నే నాగమ్మ, తిరుమలమ్మ తిరిగి మళ్లీ తమ వజ్రాల వేట.. కాదు బతుకువేట కోసం సిద్ధమయ్యారు.

తొలకరి జల్లులకు మొలకలెత్తిన గింజల్లా ఉన్నారు.. ఆ పొలంలో వజ్రాలను వెతికేందుకు వచ్చిన జనాన్ని చూస్తుంటే! ప్రతొక్కరి వెనుక ఏదో ఒక కథ. ఊరికే.. తమ అదృష్టాన్ని పరీక్షించుకోడానికి వచ్చిన వాళ్లూ ఉన్నారు.

నాగమ్మ, తిరుమలమ్మ రోజులా కాకుండా షాపతను చెప్పినట్టుగా కొంచెం చిన్నగా, తెల్లగా, నునుపుగా మెరుస్తున్నట్లుండి.. ప్రత్యేకంగా అనిపించిన రాళ్లను ఏరుకున్నారు.

సాయంత్రమైంది! ఇక అంతటితో ఆట ముగిసింది.

ఏడాదంతా కష్టపడి చదివి పరీక్షలు రాశాక ఫలితాల కోసం ఎదురుచూస్తున్న పదో తరగతి పిల్లల్లా, అక్కడున్న వాళ్ల సాయంతో ఆ రాళ్లను పరీక్షకు ఇచ్చి ఆతృతగా చూస్తున్నారిద్దరు.

తిరుమలమ్మ రాళ్లల్లో ఒక్క వజ్రమూ లేకపోడంతో ఆమె చెంపలు అప్రమేయంగా తడిసిపోయాయి. ఎన్ని కష్టాలున్నా ధైర్యంగా ఉండేది. మొదటిసారిలా డీలా పడిపోయింది.

ఇక నాగమ్మ రాళ్లను పరీక్షిస్తుంటే ఆమె ధ్యాసంతా కొడుకు మీదే ఉంది. ఇప్పుడు ఈ రాళ్లే తన గమ్యాన్ని శాసిస్తున్నట్లుగా ఉందామెకు. తన పయనం కొడుకు వెంటా..? లేక తన నీడ వెంటా..? అని తలచుకుంటుంటే అరచేతులు చల్లగా అయిపోయాయి.

''మిషను పన్నెండు పాయింట్లు చూపిస్తుందమ్మా.. ఇది వజ్రమే! ఇంచుమించు పన్నెండు లక్షల దాకా వస్తాయేమో!'' అన్న మాట వినగానే.. నాగమ్మ ఊపిరి పీల్చుకుంది. ఒకవైపు పట్టరాని సంతోషం, మరోవైపు తెలియని దుఃఖం ఆమెను చుట్టుముట్టేశాయి.

''కిస్మతక్కా! నీకంత మంచే పో! ఇగ నీ కొడుకు, కోడలు నిన్ను నెత్తిన వెట్టుకుంటరు. మస్తు ఖుషైతుందక్కా నాకైతే!'' ఒకవైపు తనచుట్టూ ఉన్న సమస్యల ఊబిలోకి జారిపోతున్న బాధలో ఉన్నా.. స్నేహితురాలి బతుక్కి ఓ దారి చూపగలిగినందుకు సంతోషంగా ఉంది తిరుమలమ్మకు. కల్మషం లేని ఆమె స్నేహానికి ఏమిచ్చి రుణం తీర్చుకోవాలో అర్థం కాలేదు నాగమ్మకు.

ఒకరు కొండంత ఆశతో, మరొకరు గుండెనిండా నిరాశతో తిరుగు ప్రయాణమయ్యారు.

* * *

''తిరుమలమ్మ ఇల్లు ఇదేనా?'' అన్న మాట విని, గుమ్మం బయట పరధ్యానంగా కూర్చుని ఉన్న తిరుమలమ్మ ఉలికిపాటుగా చూసి..

''నేనే తిరుమలమ్మని. మీరెవరు?'' అన్నది.

''నాగమ్మ..'' అతని మాట పూర్తి కాకముందే.. 'నాగమ్మ' అన్న పేరు వినపడగానే..

''ఎవరూ.. నాగమ్మనా? ఎట్లున్నది? కొడ్కుకాడికి వొయిందా? పోన్లే మంచిగుంటే అంతే సాలు! ఇంతకీ నీవెవరు? నాగమ్మ కొడ్కువి నీవేనా ఎట్ల?'' అంటూ పైకి లేచి విప్పారిన ముఖంతో అతణ్ని సమీపించింది.

''కాదమ్మా! నేను కర్నూల్నుంచి వచ్చినాను. నాగమ్మ గారు పదిరోజుల క్రితమే మా ఆశ్రమంలో చేరినారు. తన స్నేహితురాలు తిరుమలమ్మ కుటుంబం కష్టాల్లో ఉన్నదనీ, ఆమెకు ఈ డబ్బును ఎలాగైనా అందజేయాలని మమ్మల్ని కోరారు. ఆవిడిచ్చిన మీ నెంబరుకి ఫోన్ చేస్తే కలవలేదు. ఇక ఆ నెంబర్ ద్వారా మీ అడ్రస్ కనుక్కొని వచ్చినాము. ఇదిగోండి మీ డబ్బు.. మొత్తం పన్నెండు లక్షలు'' అని ఆ డబ్బును తిరుమలమ్మ చేతుల్లో పెట్టి ఆశ్రమం నెంబర్ ఇచ్చాడు.

''ఈరోజుల్లో కూడా అట్లాంటి స్నేహితురాలు ఉండటం మీ అదృష్టమమ్మా!'' అని చెప్పి అతను సెలవు తీసుకున్నాడు.

ముందు గదిలో మంచంపై పడుకుని ఉన్న తిరుమలమ్మ కొడుకు వెంకట్రాములు వాళ్ల మాటలు విని అయోమయంలో పడ్డాడు. తిరుమలమ్మ లోపలికొచ్చి జరిగిందంతా వివరంగా చెప్పింది.

వెంకట్రాములుకు నోట మాట రాలేదు. వెంటనే అతనిచ్చిన నెంబర్‌కు ఫోన్ కలిపాడు. నాగమ్మతో మాట్లాడుతూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యాడు. అక్కడుండే బదులు తమ దగ్గరే ఉండమని బతిమిలాడాడు. కానీ, ఆమె నిరాకరించింది.

''నాగమ్మా! నీవు ఆశ్రమంల జేరినవంట? ఎందుకట్ల జేశ్నవ్? మంచిగ కొడుకుతోనుండక గిదేం పని? అయినా నీకు తగిలిన అదృష్టాన్ని మాకెందుకిచ్చినవ్? నాకైతే ఏమర్థమైతలేదు'' అన్నది తిరుమలమ్మ.

నాగమ్మ ఎన్నో రహస్యాలను తన కడుపులో దాచుకున్న నిశ్శబ్ద అరణ్యంలా మౌనంగా ఉండిపోయింది.

'వజ్రం దొరికిందంట కదమ్మా! టీవిల గనవడ్డవని నీ కోడలు జెప్పింది. ఇగ మన కష్టాలన్నీ తీరిపోయినట్టే!'.. ఇంటి ముఖం చూసి ఆరు నెలలైనా.. ఫోన్ చేసినా ఎత్తని పెద్దకొడుకు.. ఆమెకు వజ్రం దొరికిందని తెలియగానే తనంతట తానే ఫోన్ చేసి, అరువు తెచ్చుకున్న ప్రేమనంతా ఒలకబోస్తుంటే.. ఆమెలోని తల్లి మనసు ఆమెను కొద్దిసేపటి వరకు వెర్రిదాన్ని చేసింది. ఆ మాయలోపడి సంతోషంతో ఉక్కిరిబిక్కిరైపోయింది నాగమ్మ.

కానీ.. ఆ తరువాత తిరుమలమ్మ గుర్తొచ్చింది. ప్రతీది డబ్బుతో ముడిపెట్టే తన కుటుంబానికి, డబ్బుకంటే మనిషి ముఖ్యం, ఆ మనిషితో తనకున్న అనుబంధం ముఖ్యం అనుకునే తిరుమలమ్మ కుటుంబానికీ.. నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా కనిపించింది.

ఈరోజు తన దగ్గర డబ్బుందని కొడుకు తిరిగి ఆమెను వెతుక్కుంటూ వచ్చాడు. అదే ఆ డబ్బంతా అయిపోయిన రోజున తన పరిస్థితి మళ్లీ రోడ్డెక్కొచ్చు. ఏ బంధమూ శాశ్వతం కాదు.. ఏదీ తనవెంట రాదన్న సత్యాన్ని మెల్లి మెల్లిగా గ్రహించగలిగింది.

అంతే.. ఊరికి తిరిగొచ్చినదల్లా తిరిగి కర్నూలు వెళ్లింది. ఇదివరకు తనకు సాయం చేసిన షాపు యజమాని ద్వారా అక్కడే ఓ వృద్ధాశ్రమంలో చేరింది. ఇప్పుడదే తన గమ్యస్థలం.

''అడుగుతుంటే ఏం జెప్పవేంది నాగమ్మా?''.. తిరుమలమ్మ మళ్లీ అడిగింది.

''కిస్మత్.. అక్కా!'' అని చెప్పి.. నిశ్శబ్దంగా నవ్వింది నాగమ్మ. ■

## స్ఫూర్తి కందివనం



'డబ్బు' అన్న రెండక్షరాలే.. బంధాలను, బంధుత్వాలనూ శాసిస్తున్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేక.. ఎన్నో జీవితాలు మోడువారి పోతున్నాయి. తొలకరి జల్లులతోనైనా తమ జీవితాలు కొత్తచిగుళ్లు తొడుగుతాయన్న ఆశతో.. ఎంతోమంది ఇప్పుడు సీమబాట పడుతున్నారు. అక్కడ నానా తంటాలు పడుతూ.. తమ అదృష్టం కోసం అన్వేషిస్తున్నారు. అలాంటి ఓ అభాగ్యురాలి కథే.. ఈ కిస్మత్! తండ్రి కందివనం రఘురామయ్య స్ఫూర్తితో.. సాహిత్యంవైపు అడుగులు వేశారు స్ఫూర్తి కందివనం. వీరి స్వస్థలం మహబూబ్‌నగర్. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. బయోటెక్నాలజీలో పీజీ చేశారు. ప్రస్తుతం సైంటిఫిక్ ఈ-జర్నల్స్ పబ్లిషింగ్ సంస్థలో ఎడిటోరియల్ అసిస్టెంట్‌గా సేవలు అందిస్తున్నారు. 2019 నుంచి రచనలు చేస్తున్నారు. ఇప్పటివరకూ 30కి పైగా కథలు, 3 నవలలు రాశారు. నమస్తే తెలంగాణ - ముల్కనూరు సాహితీ పీఠం కథల పోటీల్లో 'డిమ్కి' కథకు ప్రథమ బహుమతి (2021), 'ముసురు' కథకు తృతీయ బహుమతి (2022) అందుకున్నారు. 'నాయన చెప్పిన అబద్ధం', 'డిమ్కి', 'నల్ల చీమలు', 'ముసురు', 'చీకటి వెలుగులు' కథలు అత్యంత పాఠకాదరణ పొంది.. రచయిత్రికి మంచి గుర్తింపునిచ్చాయి. 'చైత్ర' నవలకు తెలంగాణ సారస్వత పరిషత్తు యువ పురస్కారం, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ ప్రథమ నవలా పురస్కారం దక్కింది. ఇటీవలే వెలువడ్డ తొలి కథా సంపుటి 'డిమ్కి'కి 'కందికొండ రామస్వామి స్మారక జాతీయస్థాయి పురస్కారం' అందుకున్నారు.

